ప్రవల్లిక వింటోంది. తన వూహ కరెక్టయినందుకు ఆమె మనసులో సంతోషించింది. పైకి ఎంత మామూలుగా గ్రహించింది. అందుకే అంత పెద్ద పొజిషన్‌లో వుండి కూడా రెండు మూడు పరిచయాల్లోనే అతడిని అభిమానించటం మొదలుపెట్టింది. అతడికి నిశ్చయంగా తండ్రి తెలివి తేటలు వచ్చి వుంటాయని అనుకుంది. అతడి తండ్రి 'క్రూక్' అని అనటం ఆమెకు నచ్చలేదు. ఒక్క చూపులోనే ఎవరు క్రూకో తెలుసుకోగలిగితే ఇంత పెద్ద సి.బి.ఐ. డిపార్ట్‌మెంట్ దేనికి? తమ ఇంటి అమ్మాయిని తీసుకెళ్ళి పోయినందుకు అలా అనుకుని దేనికి? తమ ఇంటి అమ్మాయిని తీసుకెళ్ళి పోయినందుకు అలా అనుకుని వుంటారు. అయినా మరణించిన వాడి గురించి చెడుగా మాట్లాడకూడదు. ఆలోచించకూడదు.

"ఆ అబ్బాయితో మాట్లాడతాను" అన్న తండ్రి మాటలకి తెప్పరిల్లి తటపటాయిస్తూ "విహారి తల్లితో మాట్లాడితే బావుంటుందేమో నాన్నా!"అంది.

"అంటే ..... అబ్బాయితో నువ్వు చెప్పేశావా?"

ఆమె మరింత ఇరుకున పడి, "చెప్పలేదనుకో. ఈ రోజే చెపుతాను. కానీ పెద్దవాళ్ల ద్వారా సంప్రదిస్తే అవిడకీ గౌరవం ఇచ్చినట్టుంటుంది కదా!" అంది.

"అవునవును. అదే మంచిది. నాల్గయిదు రోజుల్లో వెళతాను మంచిరోజు చూసుకుని" అంటూ కాలెండర్ వైపు వెళ్ళాడు.

"నువ్వు వెళతావా" అంది సందేహంగా.

ఆయన నవ్వేడు. "ఆడపిల్ల తండ్రిలా నేను వెళితేనే మంచిదమ్మా! కాళ్ళు కడగటం ధర్మం కదా."

ఆమెకీ టాపిక్ నచ్చక మాటమాడుస్తూ, "సైన్యంలో పనిచేసే వాళ్ళకి మంచి ముహుర్తమేమిటి నాన్నా" అంది.

"అదేమిటమ్మా! మాలో కొందరు శత్రు స్థావరం మీద అటాక్ చెయ్యటానికి కూడా మంచి ముహుర్తం ఏదా అని చాటుగా పంచాంగం చూసుకునే వాళ్ళు తెలుసా" అని, కాలెండర్ చూస్తూ, "ఆ ఇదిగో ఈ ద్వాదశి మంచిది. ఆ రోజు వెళతాను" అన్నాడు.

ఆమె నవ్వేసి అక్కడ నుంచి వెళ్ళిపోబోయింది.

"ఆ అబ్బాయికి ఇంతవరకూ చెప్పకపోతే, ముందొకసారి చెప్పటం మంచిదమ్మా. తీరా తల్లిని అడిగిన తరవాత కొడుకు అభ్యంతరం చెపితే కష్టం" అన్నాడు.

"ఆ విషయం నేను చూసుకుంటాన్లే " అని ఆమె కాసింత సిగ్గుతో వడివడిగా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది. కూతురు వెళ్ళినా ధైర్య సాహసాలు ఆభరణాలు అయితే అయివుండవచ్చు కానీ, 'స్త్రీత్వం' అన్నిటికన్నా పెద్ద అలంకారం.

అక్కణ్ణుంచి లోపలికి వెళ్ళిన ప్రవల్లిక ముందు గదిలోకి తొంగిచూసింది. తండ్రి దూరంగా ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. ఫోన్ ఎత్తి విహారికి డయల్ చేసింది. ఆమె పెదాలమీద నవ్వు

అట్నుంచి విహారి కంఠం  వినపడగానే “ ..... ఐ లవ్ యూ ” అంది గుసగుసగా.

“ఫోన్‌లోకాదు. ఎదురుగా నిలబడి నీతో ఆ మాట అనిపిస్తాననీ - నేను సవాల్ చేసింది” అన్నాడు.

“సవాలా ..... సవాలేమిటి?”

“ఏమీ తెలియనట్టు నటించుకు. ఎదురుగా నిలబడి ‘నాకు భయం పోయింది విహారి. ఐ లవ్యూ - అంటేనే  నేను వప్పుకునేది.”

“మంచి కుటుంబంలో పుట్టిన అమ్మాయెవరూ ఎంతో పరిచయం పెరిగితేకానీ ఆ మాట అనదు. కావాలంటే మొదటి రోజు పాలగ్లాసు అందిస్తూ అంటాలే!”

విహారి కుర్చీలోంచి ఒక్క ఉదుటున లేచి నిలబడి ..... “ఏమిటీ - పెళ్ళి వరకూ వచ్చేశావా?” అన్నాడు.

“నేను రావటం లేదు. ఆడపెళ్ళివారం కదా పెద్దలు వస్తారు” అని ఫోన్ పెట్టేసింది.

*　　　　*　　　　*　　　　*

గుళ్ళో విగ్రహం ముందు ప్రమిదలో దీపం  ఉజ్వలంగా వెలుగుతోంది. పూజారి కంఠం నెమ్మదిగా మంత్రాలు గొణుగుతోంది. సునాదమాల రెండు చేతులూ జోడించి, దాదాపు రెండు నిమిషాల నుంచి కళ్ళు మూసుకుని ప్రార్థిస్తూంది.

క్రితం రాత్రి అద్దంలో చూసుకుంటే ఆమె బుగ్గమీద చిన్న మొటిమ కనిపించింది. ఆమెకు తన కల గుర్తుకొచ్చింది. భూమిలోంచి చెట్టు మొలిచేటప్పుడు ముందు అలాగే ఉబ్బుతుంది.

భయంతో రాత్రంతా నిద్రపట్టలేదు.

ప్రొద్దున్నే గుడికొచ్చింది. ఇక ఏడుపొక్కటే తరువాయి. తెల్లవారు ఝామునుంచీ హనుమాన్ చాలీసా చదువుతూనే వుంది.

“ప్రసాదం తీసుకో అమ్మా?”

పూజారి అందించిన ప్రసాదం తీసుకొని చివరిసారిగా భగవంతుని ప్రార్థించింది. “భగవంతుడా నా బుగ్గని మళ్ళీ మామూలుగా చెయ్యి.”

ఆమె బయటికి వచ్చి గుడి మెట్లమీద కూర్చుంది. అప్పుడు వినిపించింది. వెనుకనుంచి. “పందెం కట్టగానే బెదిరిపోయి - ఫోన్‌లో చెప్పేసేవేమిటి?”

ఆమె చేతిలో కొబ్బరిచిప్ప చెదిరి మెట్లమీద పెద్ద శబ్దంతో దొర్లుకుంటూ పడిపోయింది. ఆమె బిర్రున బిగుసుకు పోయింది. విహారి చొరవగా వచ్చి పక్కన కూర్చున్నాడు.

“నేనన్నది ..... నీతో స్వయంగా ‘ఐ లవ్యూ’ అనిపిస్తానని. అంతేగాని ఫోన్‌లో కాదు.”

ఆమె ధైర్యం తెచ్చుకుంది. గుళ్ళో హనుమంతుడు ఆమెకి ధైర్యం చెపుతున్నట్టు కనిపించాడు. “నేను ఆ మాట అనలేదు అనను కూడా” అంది.

విహారికి ఇరిటేషన్ కలిగింది. కోపాన్ని అతి కష్టంమీద అణచుకున్నాడు. ఈ అమ్మాయి

రంగంలో వుంటే ఈ పాటికి ఇండియా నెంబర్‌వనే అయ్యేది.

అతడికి ఆశ్చర్యం కూడా కలిగింది. “నీతో ఐ లవ్యూ అనిపిస్తాను” అని తను ఛాలెంజీ చేశాడు. కవ్వించినట్టు అదే మాట ఫోన్‌లో అంది. మళ్ళీ ఇప్పుడు ఇలా మాట్లాడుతుంది. ఆ కంఠంలోగాని, ఆ కళ్ళలోగానీ ఎక్కడా లీలా మాత్రమైన చిరునవ్వుగానీ, ‘సర్లే, నన్ను కనుక్కున్నావ్ కదా! ఇక నుంచి మనిద్దరం ఒక జట్టు’ అన్న భావంగాని లేదు.

అతడికీ మతిపోతూంది. అంతేకాదు. దాంతోపాటు పంతం కూడా హెచ్చుతూంది. ఆ అమ్మాయిని నాలుగు తన్ని అయినా సరే ‘బాబోయ్ నిజం చెపుతాను’ అనిపించాలనిపిస్తూంది కాని అంతకన్నా నిజమయిన ఓటమి మరొకటి వుండదు. ఇంతలా తనని ఏడిపిస్తున్న అమ్మాయిని అంతే తెలివితేటలతో గెలవాలి.

“ఓ.కే. మాలా! నీతోనే పాలగ్లాసు అందుకుంటాను. అప్పుడే ఆ మాట అంటాను.”

తలతిప్పి గుడి లోపలికి చూసింది సునాదమాల.

ఆంజనేయస్వామి ధైర్యం చెపుతున్నట్టు కనిపించాడు. “పాలగ్లాసు కాదు గదా- మంచినీళ్ళ గ్లాసు కూడ ఇవ్వను” అంది. ఆమె జీవితంలో అలాంటి మాట మాట్లాడడం అదే మొదటిసారి.

“రేపు సంబంధం మాట్లాడటానికి మీ బామ్మ వచ్చినప్పుడు అదే చెపుతాను. ఆడపెళ్ళి వాళ్ళ తరపున పెళ్ళికూతురు నీళ్ళగ్లాసు అందించడం మా ఆచారమని! అప్పుడేం చేస్తావు?”

ఆమె లేచి నిలబడి “అదే నీళ్ళ గ్లాసులో కాస్త విషం పోసుకుని తాగుతాను” అంది.

అతడూ లేచి నిలబడి “నేను చలా తెలివి తక్కువ వాడిననీ, కనీసం ఒకసారయినా రెడ్ హాండెడ్‌గా పట్టుకోలేకపోయాననీ నీ నమ్మకం కదూ నిజమే! తెలివితేటలు నిరూపించుకోవలసిన బాధ్యత నామీద కూడా వుంది! నీతో సమానమైన తెలివి తేటలు నాకూ వున్నాయనీ, నీకు నేను తగిన జోడీనని నిరూపిస్తాను. సరిగ్గా రోజు కూడ చెపుతాను విను. వచ్చే ద్వాదశినాడు నీ పాణిగ్రహణం చేస్తాను. నా చేతిలో చెయ్యి వేసి ఆ విషయం వప్పుకునేలా చేస్తాను. అలా చెయ్యలేకపోతే ఇక నీ మొహం చూడను. నేను నీ అంత తెలివితేటలు లేనివాడినని, నీకు మొగుడిగా తగనని అనుకుని తప్పుకుంటాను సరేనా ..... ” అన్నాడు కళ్ళు మూసుకుని.

“వచ్చే ద్వాదశినాడా ..... ”

“అవును” కళ్ళుమూసుకునే సమాధానం ఇచ్చాడు.

“చాలా ఆలస్యమేమో. కాస్త ముందు కొచ్చెయ్యకూడదూ?”

విహారి అదిరిపడి కళ్ళు తెరిచాడు. సునాదమాల ఎప్పుడు వెళ్ళి పోయిందో తెలీదు. విష్ణు వున్నాడు అక్కడ.

“నిజం బాబాయ్. ద్వాదశివరకూ ఎందుకూ? అలస్యం అమృతం విషం అన్నారు పెద్దలు.”

“అయితే మొత్తం విషయం అంతా నీకు తెలిసిపోయిందా?”

"కిడ్నాపర్స్ దగ్గిర ఆంటీతో మాట్లాడుతున్నప్పుడే తెలిసి పోయింది."

"లాభంలేదు. మీ ఆంటీ కొయ్యగుర్రం, లక్కపిడత, ఇసుపపెనం."

"కొత్తరకం తిట్లు బాగానే వున్నాయ్‌గానీ, అసలు విషయం సాధించడం ఎలాగో అది ఆలోచించరా అబ్బీ."

మళ్ళీ అదిరిపడ్డాడు విహారి. గన్నేరు చెట్టు మాటునుంచి బామ్మ వచ్చింది. "వచ్చే ద్వాదశి గడువు పెట్టావ్ బాగానే వుంది కానీ నా మనవరాల్ని పది శతాబ్దాలు దాటినా మార్చడం కష్టమని నా ఉద్దేశ్యం. ఆ అమ్మాయిని గెలవాలంటే సెంటిమెంటు మీద ప్లే చెయ్యాలి."

"అంటే ఏం చెయ్యాలి?"

"నేను చెపుతాను రేపు రా ఇంటికి -"

విహారి సంధిగ్ధంగా "ఆ ప్లాను తప్పక ఫలిస్తుందా బామ్మ గారూ!"

"తిరుగులేదు."

"ఏమిటంత ధీమా? ఎలా చెప్పగులుగుతున్నారు?"

"సునాదమాల తాతగారి మీద నేనదే ప్లే చేశాను కాబట్టి."

* * * *

అనంతానంతస్వామి మొహం పశ్చిమ కొండల్లోకి జారుతున్న సూర్యుడి ఎరుపుదనాన్ని సంతరించుకుంది. అతడు అంత ఆవేశం ఎప్పుడూ పొందలేదు. కోటి రూపాయల విలువగల ఆయుధాలు, వాటితో పాటు పోయిన కష్టమరు -

ఇవి కావు అతడికి కోపం తెప్పించినవి!

ఎవరో సాబొటేజ్ చేసి, ఈ నష్టం కలిగించారు తనని తేలుకుట్టిన దొంగని చేశారు.

ఎవరు?

ఎవరు?

ఎవరు?

ప్రవల్లిక కాదు. ఆ సమయంలో ఆమె తన కాళ్ళ దగ్గిర పడివుంది. మరెవరు? తన వాళ్ళలోనే ఎవరో చేశారనడానికి ఆధారం లేదు. అయినా తన వారిలో అటువంటి వాళ్ళెవరూ లేరు. ఎవరికి లాభం అది? ఆ స్థానం ఎవరికి తెలిసింది?

పోలీసులకి కూడ కాదు. వాళ్ళయితే ఆధారాలతో సహ పట్టుకుని వుండేవారు. కనీసం ఆ ప్రయత్నంచేసి వుండేవారు. పేపర్లలో కూడ అది పోలీసుల పనిలాగా లేదు.

మయసభలో దుర్యోధనుడిలా కల్లోలంగా వుంది అతడి స్థితి. ప్రవల్లిక కాళ్ళ దగ్గిర పడవేసుకుని తను విజయగర్వంతో నవ్వాడు. ఈ కోటి రూపాయల నష్టం గురించి చదివి ఆవిడకూడా అలాగే నవ్వుకుని వుంటుంది. ఇదో జోక్‌లాగా ఆ విహారితో కలిసి ఆనందించి .....

విహారి!!!

స్వామి ఆలోచనలు అక్కడ ఆగిపోయాయి!

అవును - విహారి ఎందుకు కాకూడదు?

ఆలోచించేకొద్దీ అది ధృవపడుతూంది.

..... తనే స్వయంగా నిర్ధారించుకోవాలని లేచాడు.

*　　　*　　　*　　　*

తాగిన టీ కప్పు బల్లమీద పెట్టి విహారి లేచాడు. ప్రవల్లిక తండ్రి షేక్ హాండిచ్చి "నేనే రేపు అయిదో తారీఖున మీ యింటికి వద్దామను కుంటున్నాను" అన్నాడు.

"ష్యూర్. తప్పక రండి" అని ప్రవల్లికతో కలిసి బయటకు వచ్చాడు. వచ్చాక, తనలో తను లెక్కలు కట్టుకు చూసుకుని "మైగాడ్ -- ద్వాదశి!!! ఆ రోజు నేను యింట్లో వుండనే" అన్నాడు కంగారుగా.

ఆమె నవ్వాపుకుని "ఏం చేస్తాడు?" అంది.

అతడు ఇబ్బందిగా "అంతా అయ్యాక చెప్తాను. చాలా కష్టమైన పని " అన్నాడు.

"ఫర్వాలేదులెండి. మా నాన్నగారు వచ్చేది మీ అమ్మగార్ని కలుసుకోవడానికి -" అంది.

అతడు మరింత ఆశ్చర్యంతో " ..... దేనికి" అన్నాడు.

ఆమె తడబడి "మీ తాతగారు, అమ్మగారు ఆయనకి తెలుసట" అంది.

"ఓహ్ ..... అలాగా" అన్నాడు కారు దగ్గరకి నడుస్తూ.

"గుడ్‌నైట్-"

"గుడ్‌నైట్-"

అతడు కారు స్టార్టుచేసి ముందుకు పోనిచ్చాడు. పదిగజాలు వెళ్ళాక వెనుకనుంచి వినపడింది - సన్నటి స్పష్టమైన స్వరం "కంగ్రాచ్యులేషన్స్" అని.

అతడు అదిరిపడి వెనుదిరిగి చూసాడు.

"నా పేరు అనంతానంతస్వామి."

"మీరెవరు?"

"నే నెవరో తెలీదా?"

"బహుశా యిలా కార్ల దొంగతనాలు వగయిరా చేస్తూ వుంటారను కుంటాను."

"పిచ్చివాడా కావాలనుకుంటే యిలాటి కార్ల ఫ్యాక్టరీలు పది పెట్టగలను."

"మరి నా కార్లో వచ్చి కూర్చున్నారేమిటి?"

"హెచ్చరించి పోదామని వచ్చాను. అలాగే కంగ్రాట్స్ కూడా."

"దేనికి?"

"మిలటరీ వాన్‌ని బ్లాస్ట్ చేసినందుకు."

"అది మీదేనన్నమాట."